

జిల్లా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న బ్యాలెట్ బాక్సులు



ఎన్నికల పనుల్లో బిజీ..బిజీ





- బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడమే తరువాయి
- పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- ఇప్పటికే పూర్తయిన తుది ఓటరు జాబితా
- గ్రామాల్లో వార్డుకో పోలింగ్ బూత్
- పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై అభ్యంతరాల స్వీకరణ
- వార్డుల సంఖ్యకు సమానంగా బూత్‌ల ఏర్పాటు

జిల్లా పరిషత్ కార్యాలయం

మంచిర్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పనుల్లో అధికార యంత్రాంగం బిజీగా మారింది. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల చివరల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, బీసీ రిజర్వేషన్ల అమలు ప్రక్రియపై ఒకింత అయోమయం నెలకొంది. దీంతో షెడ్యూల్ ప్రకారం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా...? అన్న సందేహాలు నెలకొన్నాయి. బీసీ రిజర్వేషన్‌లకు అసెంబ్లీలో తీర్మానించిన మేరకు రాష్ట్ర గవర్నర్ ఆమోద ముద్ర వేస్తే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలనే ధృఢ నిశ్చయంతో ఉంది. ఈ క్రమంలో మొదట పరిషత్ ఎన్నికలు నిర్వహించనుండగా, అనంతరం సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల్లో భాగమైన మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మరికొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఆలస్యం పట్ల జాప్యానికి వివరణ ఇవ్వాల్సిందిగా ఇటీవల హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సర్పంచ్ ఎన్నికలు ముగియగానే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎలక్షన్లు ముగియగానే, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామ పంచాయతీల పాలన గత సంవత్సరం జనవరిలో ముగియగా, జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీకాలం జూలై మాసంతో ముగిసింది. ఏడాది సుదీర్ఘ సమయం దాటిన తరువాత ఎట్టకేలకు తిరిగి పంచాయతీ, పరిషత్ ఎన్నికలకు ప్రభుత్వం అడుగులువేస్తున్న క్రమంలో బీసీ రిజర్వేషన్ ప్రక్రియ జఠిలమై కూర్చుంది. అయితే ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధపడటంతో అధికారులు ఆ ప్రక్రియలో తల మునకలై ఉన్నారు.

వార్డుకు ఒక పోలింగ్ బూత్....

స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని 306 గ్రామ పంచాయతీలలో వార్డుకు ఒక పోలింగ్ బూత్ చొప్పున ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని మొత్తం 306 గ్రామ పంచాయతీల పరిధిలో 2,680 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డుకు ఒకటి చొప్పున పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుండగా పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ఈ నెల 6న మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారులు ప్రదర్శించనున్నారు. అలాగే 8న పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా, మండలస్థాయిల్లో అధికారులు సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు కోరనున్నారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పట్ల 6 నుంచి 8వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 9వతేదీన అభ్యంతరాల పట్ల కార్యాచరణ చేపట్టి, 10న పోలింగ్ బూత్‌ల ఏర్పాటుపై తుది ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నారు. జిల్లాలో మొత్తం 16 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఎంపీటీసీ స్థానాలు 129, జడ్పీటీసీ స్థానాలు16, ఎంపీపీ స్థానాలు 16 ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు,

(తరువాయి 7లో)

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

- చత్రునాయక్ జిల్లా వ్యవసాయాధికారి



హాజీపూర్ సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యావసాయ అధికారి చత్రు నాయక్ అన్నారు. రైతులందరికీ యూరియా అందుతుందని ఆయన అన్నారు. ఒకటి రెండు రోజులు ఆలస్యమవుతుందేమో గానీ రైతులందరికీ సరిపడా యూరియా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : జిల్లా వ్యాప్తంగా రైతులకు ఇప్పటి వరకు ఎంత యూరియా సరఫరా చేసారు ?

డీఏవో : జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 21,250 మెట్రిక్ టన్నుల యూరియా రైతు లకు అందజేయడం జరిగింది. సోమవారం మరో 400 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుంది. రైతులు ఎవరు ఆందోళన చెంద వద్దు. పంట సాగుకు సరిపడ యూ రియా తెప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఇటీవల కురిసిన వర్షాల కు పంటనష్టం ఎంత జరిగింది. పంట నష్టం అంచనా వేశారా ?

డీఏవో : ఆగస్టు నెలలో కురిసిన భారీ వ ర్షాలకు జిల్లా వ్యాప్తంగా 16వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఇప్పటి వరకు గుర్తించాం. ఇంకా సర్వే కొనసాగుతోంది. ఈ వారం రోజుల్లో సర్వేపూర్తి చేయించి ప్రభు త్వానికి తుది నివేదిక అందజేస్తాం. బాధిత రైతులకు ప్రభుత్వపరంగా పరిహారం అందే విధంగా చూస్తాం. ఎవరుకూడా అధైర్య పడాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి : యూరియా వాడకంపై రైతులకు మీరిచ్చే ఇచ్చే సూచనలు ?

డీఏవో : రైతులు అధిక మొత్తంలో యూ రియా వాడవద్దు. నానో యూరియా కూడా పంటలకు వాడుకోవచ్చు. నీట మునిగిన పంటలకు తెరుకున్నాక వ్యవసాయ అధికారుల సూచన మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అధికారుల సూచనలు పాటించడం వలన పంటలకు నష్టం జరగకుండా ఉంటుంది. కాబట్టి రైతులు ఎవరు కూడా ఇష్టానుసారంగా యూరియా వాడవద్దు అని సూచిస్తున్నాం.

జీవో సవరణ చేసే వరకు ఆందోళన తప్పదు..

- మాల మహానాడు

నియోజక వర్గ ఇన్‌చార్జి రామస్వామి



అంబేద్కర్ కాలనీలో మాట్లాడుతున్న గరిసె రామస్వామి

నస్పూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవో నంబరు 99ని సవ రించి మాలలకు తగిన న్యాయం చేసే వరకు ఆందోళన తప్పదని జాతీయ మాల మహానాడు నియోజకవర్గం ఇన్‌చార్జి గరిసె రామ స్వామి అన్నారు. నస్పూర్‌లోని అంబేద్కర్ కాలనీలో మాల సంఘ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశమైయ్యారు. సోమ వారం నిర్వహించే 'హలో మాల ఛలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి' కార్యక్రమానికి సిద్ధం కావాలని రామస్వామి కోరారు. మాలలకు న్యాయం చేయాలని కోరుతూ జీవో నంబరు 99ని సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపులో భాగంగా సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి చేసి సవరణకు ఒత్తిడి తీసుకురావాలన్నారు. జీవోకు కారణమైన ప్రతి ఎమ్మెల్యే బాధ్యత వహించాలన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు నా యకులు పాల్గొన్నారు.

గూడెం ఆలయం మూసివేత



గూడెం సత్యదేవుడి ప్రధానాలయానికి తాళం వేస్తున్న అర్చకులు

దండేపల్లి సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం ఉన్నందున గూడెం సత్యనారాయణస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. పౌర్ణమిజాతర సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం 12లోపు స్వామిదర్శనం, సామూహిక వ్రతాలను భక్తులు ఆచరించారు. శ్రీస్వామివారికి నిత్య కైంకర్యాలు మహానివేదన అనంతరం ప్రధానలయంతో పాటు అన్ని అనుబంధ దేవాలయాలను ఆలయఅర్చకులు మూసివేశారు. ఆదివారంరాత్రి 9.55 నుంచి అర్ధరాత్రి 1.26 వరకు చంద్రగ్రహణం ఉన్నందున ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామిలు తెలిపారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున గ్రహణ మోక్షానంతరం ఆలయాన్ని శుద్ధి సంప్రోక్షణ పూజలుచేసి ఉదయం 9.30 గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతిస్తామన్నారు.

హమాలీల హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బేవరేజెస్ హమాలీ కార్మికులు హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులోని ఫంక్షన్‌హాలులో నిర్వహించిన హమాలీ కార్మికుల నాలుగో రాష్ట్ర మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా బేవరేజెస్ గోదాముల్లో 2 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని, ప్రభుత్వానికి వారి ద్వారా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుందని అయినా వారిని శ్రమదోపిడికి గురి చేస్తుందన్నారు. ప్రైవేటు వ్యక్తులకు చెల్లిస్తున్న డబ్బులతో సొంత గోదాములు నిర్వహించుకునే వీలున్నప్పటికీ ప్రభుత్వం ఆ పనిచేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఫలితంగా గోదాములు స్థానికత పేరుతో బయట వ్యక్తులకు పోటీ పెరిగి హమాలీల పనులకు భద్రత కరువైందన్నారు. కంపెనీల నుంచి వచ్చిన వాహనాల్లో మద్యాన్ని బయట వ్యక్తులు దొంగతనాలు చేస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం సరైంది కాదన్నారు. హమాలీలకు మౌలిక సదుపాయలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. లక్షల రూపాయలు ప్రైవేటు వ్యక్తుల గోదాములు లీజుకు తీసుకుని ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేస్తుందన్నారు. అనంతరం గౌరవాధ్యక్షుడు రాములు మాట్లాడుతూ ఐకమత్యంతో హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలకు కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా ఫంక్షన్‌హాలుకు చేరుకుని జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, గోమాస పకాష్, దాసరి రాజేశ్వరి, దేవదాస్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ నేటిఆధునిక సాంకేతిక ప్రపంచంలో సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. ఇటీవల పట్టణంలోని మూడవ జోన్‌కు చెందిన ఓయువకుడు తన ఉన్నత చదువుల కోసం రూ. 50 వేలు లోన్ కోసం ఆన్‌లైన్‌యాప్‌లో దరఖాస్తులు చేసుకోగా లోన్ ఆమోదం పొందిందని నమ్మించి అతనివద్ద నుంచి చార్జీల రూపేణా రూ. 37500 కాజేశారన్నారు. దీనిపై కేసునమోదు చేశామని తెలిపారు. ప్రజలందరు బ్యాంకు ఖాతా ఏటీఎం, ఓటీపీ వివరాలను చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్ యాప్‌లలో లోన్‌లు తీసుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు ఫోన్ చేయాలన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మత విద్వేశాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య అలజడి సృష్టించే వాతావరణం కలగజేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ సమితి సభ్యులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చిట్ల సత్యనా రాయణ, తూముల నరేష్, పూదరి తిరుపతి మాట్లాడు తూ శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేదికపై మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రజలను రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించారని అన్నారు. హిందువుల మత విద్వేశాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారని అన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై, కాంగ్రెస్ నాయకులపై అనుచిత వాఖ్య లు చేసిన మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముక్కులు మూసుకుని పోవాల్సిందే..

- టైర్ల కంపెనీ నుంచి విపరీతమైన దుర్వాసన, పొగ
- అనారోగ్యాల భారిన పడుతున్న రైతులు

7

చిరు వ్యాపారులకు ప్రభుత్వం చేయూత

మందమర్రిటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిరు వ్యాపారులకు తమ ప్రభుత్వం చేయూతనందిస్తుందని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఇందుగార్డెన్ పక్కన హోటల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకులు కూడా చిరువ్యాపారులకు చేయూతనందించి రుణాలను అందించాలన్నారు. ఇటీవల చాలామంది నిరుద్యోగులు స్వయం ఉపాధి అవకాశాల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

చెన్నూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని 3,10,18 వార్డుల్లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు అప్పుడే మంచిగుండే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేశారు. నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమైందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా దొరకక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బీఆర్ఎస్ హయాంలో యూరియా కష్టాలు లేవన్నారు. రైతులు ఇవన్నీ గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలను విజయవంతం చేయాలి



నెన్నెలలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నెన్నెల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న చేపట్టనున్న సామూహిక వివాహాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం సభ్యులు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం కరపత్రాలతో ప్రచారం చేశారు. వివాహంచేసే తాహతు లేని నిరుపేదలకోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. బంగారు పుస్తెలు, మెట్టెలు, వధూవరులకు వస్త్రాములు ఉచితంగా అందజేస్తామన్నారు. తల్లిదండ్రుల అంగీకార పత్రంతో ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జంటతరపున 40మంది బంధువులకు విందుభోజనం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తిగలవారు తమను సంప్రదించాలని కోరారు. గెల్లి జయరాం, ఏనుగు రమేష్, బోగ శ్రీనివాస్, రంగ రామన్న, నరేంద్రుల వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

కాలువలు ఇలా..

సాగునీరు పారేదెలా..



దండేపల్లి 28వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో సిమెంట్ లైనింగ్ దెబ్బతిని కూలిన రాళ్లు

దండేపల్లి సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడెం ప్రాజెక్టు ద్వారా అందించే సాగునీరు ఆయకట్టు చివరి పంటలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. దండేపల్లిలో 28వ డిస్ట్రిబ్యూటరీ కాలువ, తానిమడుగులో 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువలలో చెత్తచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయి సాగునీరు ముందుకు సాగడం లేదన్నారు. ఒకవైపు ఆయకట్టు కింద రైతులు పంటలు సాగు చేశారు. మండల పరిదిలో ఆయా గ్రామాలలో పలు డిస్ట్రిబ్యూటరీ కాలులు ధ్వంసంకాగా దీనికి తోడు కాలువలో చెత్త చెదారంతో నిండి పిచ్చి మొక్కలతో గడ్డి ఎపుగా పెరిగి సాగునీరు ముందుకు వెళ్లక కాలువ ఓ ప్రకృతి వనంగా తలపింపజేస్తుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆయకట్టు చివరి పంటలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఆయకట్టు చివరి పంటలకు సాగునీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



వెంకటాపూర్‌లో 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో నిండిన పిచ్చిమొక్కలు చెత్తాచెదారం

మహిళా ఓటర్లే అధికం

● జాబితా విడుదల చేసిన అధికారులు

వాంకిడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పంచాయతీ ఓటర్ల లెక్కతేలింది. ఇటీవల ఎన్నికల అధికారులు విడుదల చేసిన తుదిజాబితా ప్రకారం జిల్లాలోని 335 పంచాయతీల్లోని 2,874 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,53,895 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 1,76,606మంది పురుషులు, 1,77,269మంది మహిళలు 20మంది ఇతరులు ఉన్నారు. పురుషులకన్నా మహిళలు 663మంది అధికంగా ఉన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మహిళాఓటర్లు కీలకంగా మారనున్నారు.

● **తప్పులు పునరావృతం కాకుండా..**

గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందిగా చర్యలు చేపట్టింది. రెండేళ్లక్రితం నవంబరులో శాసనసభ, గతేడాది మే మాసంలో జరిగిన లోక్‌సభఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాలో ఉన్న తప్పులను తొలగించారు. ఈ జాబితాను ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదు,



మార్పులు, చేర్పులతో పాటు సవరణలకోసం వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని, అర్హతఉండి ఓటరు లేని వారంత నమోదు చేసు కోవాలని అధికార యంత్రంగా విస్తృతంగా ప్రచారం చేయించింది.

మండలాల వారీగా పంచాయతీ ఓటర్లు				
మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆసిఫాబాద్	15,039	15,276	0	30,315
వాంకిడి	14,458	14,134	3	28,595
తిర్యాణి	8,863	9,281	4	18,148
సిర్పూర్(యూ)	5,835	6,440	2	12,277
సిర్పూర్(టి)	11,016	11,163	3	22,182
రెబ్బెన	14,523	14,201	0	28,724
పెంచికలపేట్	6,218	6,084	0	12,302
లింగాపూర్	5,103	5,479	1	10,583
కౌటాల	13,796	13,560	1	27,357
కెరమెరి	12, 145	11,880	1	24,026
కాగజ్‌నగర్	22,857	22,383	2	45,242
జైనూర్	11,936	12,427	0	24,363
దహెగాం	11,014	11,077	1	22,092
చింతలమానేపల్లి	12,118	11,837	0	23,955
బెజ్జూరు	11,685	12,047	2	23,734

పోలీస్ అధికారి వైఖరిపై విమర్శలు

- విచారణ జరుపుతామన్న రామగుండం సీపీ



బాధితుడు శ్రావణ్‌కుమార్

కోల్‌సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనం సందర్భంగా ఓ పోలీసు అధికారి ప్రవర్తన చర్చ నీయాంశంగా మారింది. ఖని సమీపంలోని గోదావరినదిలో సింగరేణి, రామగుండం నగరపాలక సంస్థ సహకారంతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన గణపతులను నిమజ్జనం చేశారు. ఈ నెల 5వ తేదీ నుంచి నిమజ్జనం జరుగు తుండగా కార్పొరేషన్, సింగరేణి ఉద్యోగులు షిఫ్టుల వారీగా డ్యూటీలు చేస్తున్నారు. శనివారం రాత్రి జీడీకే 11ఇంక్లైన్‌కు చెందిన ఎంపీ ఆపరేటర్ గండు శ్రావణ్ కుమార్‌కు గోదావరి వంతెన వద్ద ఎస్కార్ట్ క్రేన్‌తో నిమజ్జనం చేయించేందుకు డ్యూటీ కేటాయిం చారు. 4వ నంబర్ ప్లాట్‌ఫాం వద్ద శ్రావణ్‌కుమార్ క్రేన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతనితోపాటు సీనియర్ సర్దార్ చిగుడి సాయి చరణ్, ఉద్యోగులు బండి నరేష్, గుండేటి మహేష్‌లకు విధులు కేటాయించారు. రామగుండం కార్పొరేషన్ నుంచి చెరుకు శంకర్, శానిటరీ ఇన్‌స్పె క్టర్ సంపత్ విధులు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో రద్దీ పెరిగింది. నిమజ్జనానికి వచ్చిన వాహనానికి సంబంధించి ఫ్రేమ్‌లు ఉండడంతో వాటిని తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. సమయం ఉండడంతో శ్రావణ్‌కుమార్ మూత్ర విసర్జన కోసం క్రేన్ దిగాడు. ఆ సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ క్రేన్ ఎందుకు దిగావంటూ శ్రావణ్‌కుమా ర్‌ను గద్దించాడు. తాను సింగరేణి ఉద్యోగినని, బాత్ రూమ్‌కు వెళ్లివస్తానని చెబుతున్నా వినకుండా చేయిచేసుకున్నా డని, మళ్ళీ క్రేన్ ఎక్కేందుకు వెళుతుండగా మరో మారు కొట్టినట్టు బాధితుడు పేర్కొంటున్నాడు. తోటి ఉద్యోగులు సైతం అకారణంగా దూషిస్తూ చేయి చేసు కొన్నాడని పేర్కొన్నారు. దీంతో శ్రావణ్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లి పోయాడు. ఈ ఘటనపై సింగరేణి జీఎంకు ఫిర్యాదు చేశారు.

ఘటనపై విచారణ జరుపుతాం..
సీపీ అంబర్ కిశోర్ ఝా

సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసులు, ప్రభుత్వశాఖల సమన్వయంతో గణపతి నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి ఘటనలు జరుగలేదు. నిమజ్జనంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాం. గోదావరి వంతెన వద్ద ఏం జరిగిందనే విషయమై విచారణ జరుపుతాం.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో బహుమతులు

రెబ్బెన, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో కుమరం భీం జిల్లాకు చెందిన వారు రెండు బహుమతులు సాధించారని జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేసరి అంజనేయులు గౌడ్ తెలిపారు. సబ్ జూనియర్ కేటగిరిలోని బాలుర విభాగంలో సుపైన్ పోజు విభాగంలో ఫాతిమా కాన్వెంటుకు చెందిన 6వ తరగతి విద్యార్థి శ్రీయన్ గోల్డ్ మెడల్ సాధించినట్టు పేర్కొన్నారు. లెగ్ బ్యాలెన్స్ విభాగంలో జడ్పీపీ హైస్కూల్ కౌటాల పదో తరగతి చదువుత్ను అఖిల్ సింగ్‌కు సిల్వర్ మెడల్ సాధించినట్టు తెలిపారు. పథకాలు సాధించిన క్రీడాకారులను యోగాసన స్పోర్ట్స అసోసియేషన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంరెడ్డితో పాటు పలువురు అభినందించారు.

జర్నలిస్టులకు సన్మానం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతీ వారోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి వాసవి కన్యాకపరమేశ్వరి ఆలయంలో జర్నలిస్టులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శంకర్, శ్రీనివాస్, రమేష్, నితేష్, మహేష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రమోద్, వెంకన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి డ్రగ్స్ ముఠా వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్రలో మొదటి అతి పెద్ద డ్రగ్స్ కేసు హైదరాబాద్‌లోని చర్లపల్లిలో 12వేల కోట్ల విలువైన డ్రగ్స్ ఒక కంపెనీలో పట్టుబడటం దారుణమని, దీని వెనుకాల కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందని బీఆర్ఎస్ రాష్ట ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనికి హోం మంత్రి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో గుజరాత్‌లో ఆదానికి సంబంధించిన పోర్టులో 21 వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయని గుర్తు చేశారు. తెలంగాణలో రెండో అత్యంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ దొరకడం ఆందోళనకరంగా ఉందన్నారు. ఈ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు చేసింది మహారాష్ట్ర పోలీసులని చెప్పారు. నెల రోజుల పాటు మహారాష్ట్ర పోలీసులు మకాం వేసి అన్ని ఆధారాలతో దాడులు చేసి డ్రగ్స్‌ను పట్టుకున్నారని అన్నారు.ఓలేటి శ్రీనివాస్ విజయ్, పండరినాథ్, జలెందర్ రెడ్డి అనే నిందితులు ఈ దందా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారని అన్నారు. ఈ డ్రగ్స్ అంతర్జాతీయంగా సరఫరా చేస్తున్నారని అన్నా రు. ఈ విషయం మహారాష్ట్ర పోలీసులు చెబుతుంటే తెలంగాణ పోలీసులు ఏం చేస్తున్నట్టు ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో నడుస్తున్న హోం శాఖ విఫలమైందని తెలిపారు. సమావేశంలో సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, కొంగసత్యనారాయణ, గోలేంవెంకటేష్ పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమం, సామాజిక శాసనాల ఫౌండేషన్ రాష్ట్ర చైర్మన్‌గా వెంకటేష్ ముండే



వెంకటేష్ ముండే

జైనూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమం, సామాజిక శాసనాల ఫౌండేషన్ తెలంగాణ చైర్మన్‌గా రాష్ట్ర వంజరి సంఘం నాయ కుడు వెంకటేష్ ముండే నియమితులయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తాను చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం చైర్మన్‌గా నియమిం చిందని చెప్పారు. ఎవరైనా సామాజిక కార్యక్ర మాలకు విరుద్ధంగా, మానవ హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా బాధితులకు న్యాయం కలిగించేలా ఫౌండేషన్ పని చేస్తుందని చైర్మన్ వెంకటేష్ ముండే తెలిపారు. మానవ హక్కులకు ఇబ్బంది కలుగకుండా తాము పాటుపడుతామని చెప్పారు. పేదలకు న్యాయం చేసేందుకు పని చేస్తామని తెలిపారు.

మంత్రిని కలిసి.. సమస్యలు వివరించి..

జైనూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మార్లవాయి గ్రామానికి చెందిన హైమన్ డార్ఫ్ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కనక వెంకటేష్ ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌ను ధర్మపురి క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు ఆశ్రమ పాఠశాల విద్యా సంస్థల విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మార్లవాయిని గిరిజనాభివృద్ధి ప్రణాళికలో చేర్చాలని అన్నారు. గుస్సాడి శిక్షణ కేంద్రానికి నిధులు మంజురు చేయాలని, డార్ఫ్ దంపతుల వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాటుకోళ్ల పెంపకంతో లాభాలు

- స్వయం ఉపాధిలో రాణిస్తున్న యువకుడు

జైపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ వరకు చదివిన ఆ యువకుడు ఉద్యోగాల కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఉన్న ఊరిలో ఎలాంటి ఉపాధి అవకాశాలు కనిపించలేదు. పట్టణాల్లో ప్రైవేటు ఉద్యోగంపై పెద్దగా ఆసక్తి లేకపోవడంతో చివరికి స్వశక్తితో ఉపాధి వైపు మళ్లాడు. వారికి ఉన్న మామిడి తోటలోనే నాటు కోళ్ల పెంపకం చేపట్టాడు. మొదట్లో అవగాహన లోపంతో అనేక ఒడిదుడుకులను చవిచూశాడు. తెచ్చిన పిల్లలు సకాలంలో పెరగకపోవడం, రోగాలతో మృత్యుతవాత పడడం తదితర నష్టాలను చవిచూశాడు. కానీ అతను ఏర్పర్చుకున్న లక్ష్యాన్ని విడిచి పెట్టకుండా మరింత శ్రద్ధ పెట్టాడు. మూడేళ్లలో సక్సెస్ అయ్యాడు. ప్రస్తుతం ప్రతీ నెల వేల రూపాయలు సంపాదిస్తూ నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.



ఇంక్యుబేటర్‌లోని కోడిగుడ్లు

ప్రతీ నెల ఆదాయం..

జైపూర్ మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన చెలుకల శ్రావణ్‌కు రసూల్‌పల్లిలోని నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. అందులో రూ. 5 లక్షలు వెచ్చించి రూ. 2 వేల నాటు కోళ్లను పెంచే విధంగా ప్రత్యేకంగా షెడ్లు నిర్మించాడు. ముందుగా ఒక్క ఏడాది కరీంనగర్‌కు చెందిన సోనాలి ఆసిల్‌క్రాస్ కోడి పిల్లలు తెచ్చి పెంచాడు. కానీ అవి నాలుగు నెలలు గడిచినప్పటికీ సైజు, బరువు పెరగక పోవడంతో పెద్దగా లాభాలు లేక నష్టాలను చూశాడు. ఆ తర్వాత నాటుకోళ్ల పెంపకంపై కొంత అవగాహన ఏర్పర్చుకుని గ్రామంలోని పెరటి కోళ్ల పిల్లలు తెచ్చి పెంచాడు. వాటి ద్వారా వచ్చిన గుడ్లను ఇంక్యుబేటర్‌లో ఉంచి పిల్లలను తీశాడు. అలా వందల సంఖ్యలో నాటు కోళ్లను పెంచాడు. ప్రస్తుతం ప్రతీ నెల నాటుకోళ్ల గుడ్లను ఇంక్యుబేటర్ ద్వారా పొదిగి వాటి ద్వారా వచ్చిన పిల్లలను విక్రయిస్తూ ప్రతీ నెల సుమారు రూ. 50 వేల వరకు ఆర్జిస్తున్నాడు. అంతేకాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి సు మారు 400లకు పైగా నాటుకోళ్లను విక్రయిస్తున్నాడు. కిలోకు రూ. 450 నుంచి 500ల వరకు పట్టణాల్లో విక్రయిస్తూ సుమారు రూ. 2 లక్షల వరకు పొందు తున్నాడు. కోళ్లకు దానా ఖర్చులు పోను ప్రతి నెల కోడి పిల్లలను విక్రయించడం ద్వారా రూ. 30 వేలకు పైగా వస్తుండగా ప్రతి మూడు నెలలకు ఒకసారి నాటుకోళ్ల విక్రయించడం ద్వారా లక్ష రూపాయలకు పైగా ఆదాయం సమకూరుతోందని శ్రావణ్ చెబుతున్నాడు. కష్టపడితే సాధించలేనిది ఏది లేదని నిరూపిస్తూ యువతకు ఆదర్శగా నిలుస్తున్నాడు.




షెడ్డులో పెంచుతున్న నాటుకోళ్లు



10 నుంచి సింగరేణి వార్షిక క్రీడలు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఏరియా వార్షిక క్రీడాపోటీలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు క్రీడల గౌరవ కార్యదర్శి సృజన్‌పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్ గ్రూప్‌లో ఎస్ఆర్‌పీ1, ఎస్ఆర్‌పీ 3, శ్రీరాంపూర్ గ్రూప్-1లో ఆర్‌కే-5, ఆర్‌కే 6, ఇందారం 1ఏ, శ్రీరాంపూర్ గ్రూప్-2 లో ఆర్‌కే 7, ఆర్‌కే న్యూటెక్, అదర్స్ గ్రూప్‌లో శ్రీరాంపూర్ ఓసీపీ, ఇతర విభాగాలు, ఎస్‌టీపీపీ ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన వాలీబాల్, 11న బాస్కెట్‌బాల్, 12న బాల్ బ్యాడ్మింటన్, 13, 14న అథ్లెటిక్స్, త్రోబాల్, స్విమ్మింగ్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, 15న ఫుట్‌బాల్, 16న హాకీ, 17న లాన్ టెన్నిస్, 18న కబడ్డీ, 20, 21న క్రికెట్, చెస్, క్యారమ్స్, 28న కల్చరల్ పోటీలుంటాయని తెలిపారు. క్రీడలు, కల్చరల్ అంశాల్లో ప్రావీణ్యం కలిగిన ఉద్యోగులు తమ గ్రూప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలతో కార్మికులు సతమతం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీ యూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీలు దారుణంగా విఫలమయ్యాయని దీంతో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని సీఐటీయూ బ్రాంచ్‌కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్‌లు అన్నారు. మందమర్రిలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లాభాల వాటా కోసం తమ యూనియన్ రాజీలేని పోరాటాలకు సిద్ధమైందన్నారు. సొంతింటి కళ కోసం అన్ని గనుల వద్ద బ్యాలెట్ ఓటింగ్ పద్ధతి ప్రవేశపెట్టామని, కార్మికులందరు పాల్గొనాలని కోరారు. సమావేశంలో రామస్వామి, రమేష్, సంజీవరెడ్డి, సురేష్, మల్లేష్, కుమారస్వామి, తాజుద్దీన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో క్రీడలపై చిన్నచూపు

- డ్రెస్సులు ఇవ్వరు.. బూట్లు రావు..
- మూడేళ్లుగా అందని క్రీడా కిట్లు
- ఇబ్బందులకు గురవుతున్న ఆటగాళ్లు

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): అన్ని సంస్థల్లో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండగా, సింగరేణిలో మాత్రం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. బడ్జెట్ కేటాయిస్తున్నా క్రీడా దుస్తులు, కిట్లు అందడం లేదు. ఫలితంగా ప్రాక్టీస్ చేసుకునేందుకు క్రీడాకారులు తమ సొంత ఖర్చులతో మెటీరియల్ కొనుగోలు చేస్తున్నారు. కోల్ ఇండియా స్థాయిలో విజయాలు సాధిస్తున్నా యాజమాన్యం నుంచి ప్రోత్సాహం కరువైంది.కబడ్డీ, హాకీ, క్రికెట్, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, క్యారమ్స్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బా స్కెట్ బాల్, తదితర క్రీడాంశాలలో ఆటల పోటీలు జరుగుతాయి. ఆయా అంశాల్లో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు కలిపి రెండు వేలకు పైగా క్రీడా కారులు ఉన్నారు. వీరిలో చాలా మంది ఏరియా స్థాయి, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలో ఆడుతున్నారు. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడ ల్స్, ఇతర బహుమతులు కూడా పొందిన వారు చాలా మంది ఉన్నారు. కొన్నేళ్లుగా ఉన్న సీనియర్ క్రీడాకారులతో పాటు కారుణ్య నియామకాల ద్వారా వచ్చిన యువ క్రీడాకారులు ప్రతిభ చూపుతున్నారు.

యాజమాన్యం నుంచి..

మూడు సంవత్సరాలుగా సింగరేణి యాజమాన్యం నుంచి ఒక్కటే మాట వినిపిస్తోంది. క్రీడాదుస్తులు, కిట్లు వస్తాయని. కానీ ఇంతవరకు వాటిని పంపిన పాపాన పోలేదు. 55 లక్షల రూపాయలు క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు యాజమా న్యం నుంచి డబ్బులు విడుదల య్యాయి. అయినా కొనుగోళ్లు మాత్రం జరగడం లేదు. క్రీడా సమగ్రి కొనుగోలు చేసేందుకు కార్పొరే ట్ స్థాయిలో పర్చేజ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు కొనుగోలు చేసేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లి కొటేషన్లు తీసుకుంటారు. కానీ ఏ వస్తువూ కొన్న పాపాన పోవడంలేదు. గతంలో కొన్న సామగ్రిలో కేవలం 60 శాతం మాత్రమే 11 ఏరియాలకు అందజేశారు. మిగిలినవి గోదాంలో మగ్గిపోతున్నాయి. వాటిలో కొన్ని పనికిరాకుండా పోయాయని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో హాకీ ఆడుతున్న ఆటగాళ్లు(ఫైల్)

సొంత ఖర్చులతో..

నిత్యం ప్రాక్టీస్ చేసేందుకు కంపెనీ ద్వారా సరఫరా అయిన డ్రెస్సులు, బూట్లు, కిట్లు అందుబాటులో లేకపోవడంతో క్రీడాకారులు తమ సొంత ఖర్చులతో వాటిని సమకూ ర్చుకుంటున్నారు. ఓ వైపు క్రీడా సామగ్రి ఇవ్వకపోగా మరోవైపు వారికి ఇతర సంస్థల్లోని క్రీడాకారుల మాదిరిగా వసతులు, వెసులుబాట్లు కల్పించడం లేదని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది క్రీడాకారులు నివాసం ఉండే క్వార్టర్లు స్టేడియాలు, ఆట స్థలాలకు దూరంగా ఉన్నాయి. అలా కాకుండా వారికి స్టేడియాలకు సమీపంలో ఉండే క్వార్టర్లు కేటాయిస్తే సౌకర్యంగా ఉంటుంది. అలాగే కొందరు తమ కుటుంబాలకు దూరంగా విధులు నిర్వర్తిస్తూ క్రీడల్లో పాల్గొంటున్నారు. అలాంటి వారికి వారు కోరుకున్న ప్రాంతాలకు బది లీ చేసి కుటుంబాలతో ఉండేటట్లు చూడవచ్చు. దీని వల్ల తమ విధులకు ఆటంకం కలుగకుండా ఆటల పోటీల్లోనే విరివిగా పాల్గొంటారు. ఇవి యాజమా న్యం ఎలాంటి ఖర్చు లేకుండా చేయగలిగిన పను లు. కానీ మనది బొగ్గు వెలికితీసే సంస్థ అవన్నీ వీలు కావండీ అంటూ అధికారులు సీనియర్ల నుంచి వచ్చే సూచనలను తోసిపుచ్చుతున్నారు. ఏదైనా క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లిన క్రీడాకారులకు ఆన్‌డ్యూటీ(ఓడీ) సౌకర్యం ఇస్తున్నప్పటికీ అరకొరగా ఉంటున్నాయని క్రీడాకారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోగాని, ఇతర రాష్ట్రాల్లోగాని ఆడేందుకు వెళ్లి నప్పుడు పోవడానికి, రావడానికి, ఆడిన రోజులకు మాత్రమే ఓడీ ఇస్తుం డగా, పోటీల నుంచి రాగానే విశ్రాంతి తీసుకోవ డానికి అవకాశం లేకుండా పోతోందని వాపోతు న్నా రు. అదనంగా ఒకటి, రెండు రోజులు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. సింగరేణిలోని 11 ఏరియాల్లో స్పోర్ట్స్ సూపర్‌వై జర్లు క్రీడలను, క్రీడాకారులను సమన్వ యపరుస్తు న్నారు. సమాచారం, శిక్షణ, తదితర అంశాల్లో చేదో డువాదోడుగా ఉంటున్నారు. అయితే ఇప్పటి వరకు ఉన్న సూపర్‌వైజర్లలో మూడు ఏరియాలకు చెందిన ముగ్గురు రిటైర్ కాగా, వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. 2026లో ఇద్దరు, 2027లో ముగ్గురు రిటైర్ కానున్నారు. ఒక్కరికి తొమ్మిదేళ్లపాటు సర్వీసు ఉండడంతో ఆయన ఎక్కువ రోజులు సేవలు అందించే అవకాశం ఉంది.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

జైపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమ లు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్య క్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఇందారం ఉపరితల గనిలో ఏర్పాటు చేసిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన ఆదివారం మాట్లాడారు. సింగరేణిలో దాదాపు 33 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వీరంతా శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. కాంట్రాక్టు మారినా గతంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను కొనసాగించాలని గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు చెప్పామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం కాంట్రాక్టు కార్మికులు శ్రీనివాస్, సాయికుమార్,ఇర్ఫాన్, షబ్బీర్, మహేందర్, శంషీద్దీన్, అబ్దుల్లా , రాజశేఖర్, సతీష్ ఏఐటీయూసీలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డిప్యూటి ప్రధాన కార్యదర్శి ఎల్లాగడ్డి, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పోశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏరియా ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే రోగులకు ఓపీ రాయించేందుకు బారులు తీరాల్సి వస్తోందని తెలిపారు. వాన, ఎండకు రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఓపీ చిట్టీలు రాసే వద్ద షెడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. షెడ్డు నిర్మించాలని, కుర్చీలు ఏర్పాటు చేయాలని, తాగునీరు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



గంగారంలో ఎమ్మెల్యే చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

నెన్నెల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకుగాను కృతజ్ఞతగా గంగారం, చిన్నవెంకటాపూర్, కొత్తూరు గ్రామాల ప్రజలు ఆదివారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పెద్దచెరువు మత్తడివాగుపై బ్రిడ్జీ, రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ నిధులు రూ.3.15 కోట్లు మంజూరయ్యాయి. బ్రిడ్జీ లేక పోవడంతో వర్షాకాలంలో ఆ రూట్‌లో వెల్లే విద్యార్థులు, ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఆయా గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గడంతో పాటు, రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. స్థానిక యువ నాయకుడు రాజ్‌కుమార్ చొరవతో ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమ్మయ్య, తిరుమలేష, దేవేందర్, లింగయ్య, స్వామిరెడ్డి రచ్చపల్లి స్వామి, బానేష్, అంకయ్య పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి..



కాసిపేటలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కాసిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను తగ్గింపు చేయడాన్ని హర్షిస్తూ ఆదివారం బీజేపీ నాయకులు కాసిపేటలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు సూరం సంపత్ మాట్లాడుతూ జీఎస్టీ స్లాబ్‌లు తగ్గించడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు సంతోష్, బాలరాజు, కిరణ్, చారులత, రాంచందర్, శైలజ, వెంకటేశ్వర్లు, ఆదర్శ్, సుబ్బు, మహేష్ పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వినాయక నిమజ్జన వేడుకల అనంతరం గ్రామ శివారులో యువకులు ఆదివారం విందులు చేసుకున్నారు. ఇరు వర్గాల నడుమ మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడికి దిగారు. యువకుల గొడవ తారస్థాయికి చేరుకోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలను శాంతింపజేశారు. స్వల్ప గాయాల పాలైన యువకులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల కాలేజ్ రోడ్డు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆదివారం పరిహారం అందజేశారు. సీనియర్ ఆటో డ్రైవర్ మాదరవేణి నర్సింగం అకాలమరణం పొందగా, 5వ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ ప్రణాళిక సంఘం చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ హాజరయ్యారు. ఆయన చేతులమీదుగా నర్సింగం కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, 25 వేల రూపాయల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ రోడ్డు ఆటోయూనియన్ ప్రెసిడెంట్ ఎండీ షఫీ, జిల్లా గౌరవ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీధర్, మంచిర్యాల టౌన్ ఆటో యూనియన్ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న ముఖేష్‌గౌడ్

ముక్కులు మూసుకుని పోవాల్సిందే

- టైర్ల కంపెనీ నుంచి విపరీతమైన దుర్వాసన, పొగ
- అనారోగ్యాల బారిన పడుతున్న రైతులు



ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద టైర్ల కంపెనీ

హాజీపూర్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట్ పంచాయతీ పరిధిలోని ఎల్లంపల్లి ప్రా జెక్టు కమాన్ ముందు ఉన్న టైర్ల రీసైక్లింగ్ కంపెనీ నుంచి వస్తున్న దుర్వాసనతో అనారోగ్యాల బారిన పడుతున్నామంటూ గుడిపేట్ శివారు రైతులు, ఎల్లంపల్లి సందర్శకులు ఆందో ళన చెందుతున్నారు. రోజు వారి పొలాలకు వెళ్తున్న ఆ కంపెనీ చుట్టు పక్కన రైతులు ము క్కులు మూసుకుంటున్నారు. ప్రాజెక్టు కమాన్ ముందు పోచమ్మ, పెద్దమ్మతల్లి ఆలయాలు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అక్కడే వంటా వార్పు కూడా చేసుకుంటుంటారు. కానీ అక్కడ దుర్వాసన రావడంతో ఇబ్బందిగానే ఆదరబాదరగా మొక్కు లు చెల్లించుకొని దూర ప్రాంతంలో వంటలు చేసుకోవాల్సి వస్తోంది. కంపెనీ నుంచి వచ్చే గాలి పీల్చలేకపోతున్నామని, కళ్లు మండుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొగ, దుర్వాసన...

టైర్ల కంపెనీలో టైర్లను కాల్చి అందులో ఉన్న స్టీల్ వేరు చేసి, మిగితా చూరతో ఆయిల్ తీస్తున్నారు. టైర్ల ను కాల్చే ప్రక్రియలో భాగంగా పొగతో పాటు దుర్వా సన వస్తుంది. హైడ్రో కార్బన్స్, నైట్రోజన్, బెంజీన్ వంటి విషవాయువులు వెలువడుతుండడం వలనల క్యాన్సర్ కారకాలతో పాటు, శ్వాసకోస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన కరువు...

టైర్ల కంపెనీ చుట్టూ ఉన్న 200 ఎకరాల రైతులు ఈ దుర్వాసనతో ఇబ్బందులు పడు తున్నారు. టైర్ల కంపెనీ నుంచి వచ్చే పొగ, దుర్వాసన తో అనారోగ్యాల భారిన పడుతున్నామని సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టిం చుకునే వారే లేరని రైతులు వాపోతున్నారు.

పంచాయతీకి కూడా సదరు కంపెనీ యాజమాన్యం ట్యాక్స్ చెల్లించడం లేదనే విమ ర్శలున్నాయి. గతంలో పంచాయతీ అధికారులు నోటీసు ఇచ్చారు కానీ తరువాత ఎలాంటి చర్యలు తీసుకున్న తాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు.

పంటపొలాలకు వెళ్లలేక పోతున్నాం...



టైర్ల కంపెనీ నుంచి వచ్చే పొగ వాసనతో పొలాలకు పోలేక పోతున్నాము. గతంలో ఈ విషయమై పిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోలేదు. అప్పుడప్పుడు నాకు శ్వాస ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే బాగుంటుంది. **- కందుల రమేశ్, రైతు గుడిపేట్**

కళ్లల్లో మంటలు వస్తున్నాయి...



కంపెనీ ముందు నా పొలం ఉంది. ముక్కు, కళ్లు, మూసుకొని ఉండాల్సి వస్తోంది. కళ్లలో మంటలు వస్తున్నాయి. ఒక్కోసారి దమ్మువస్తుంది. ఉదయస్తమానం పొలంపనులు చేయలేక పోతున్నాం.

- లగిశెట్టి సాయికుమార్, రైతు గుడిపేట్

శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం...

టైర్లను కాల్చే వ్యర్థాలతో హైడ్రోకార్బన్స్, నైట్రోజన్ ఆక్సైడ్ వంటి విషవాయులు వెలువడుతాయి. అవి పీల్చడం వలనల శ్వాస కోస వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. క్యాన్సర్ కారకాకాలు కూడా ఉంటాయి.

- లహరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు

ఎన్నికల పనుల్లో బిజీ..బిజీ

(5వ పేజీ తరువాయి)

ఇతర సామగ్రి జిల్లాకు ఇప్పటికే చేరింది. ఎంపీటీసీ ఎన్నికల కోసం గులాబీ, జడ్పీటీసీ పోలింగ్ కోసం తెలుపురంగు బ్యాలెట్‌పేపర్లను సిద్ధం చేస్తున్నారు.

టికెట్ల వేటలో ఆశావహులు...

ప్రాదేశిక ఎన్నికల్లో టికెట్ సాధించాలనే పట్టుదలతో పోటీచేసే ఆశావహులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మా నం చేయనుండగా, సంబంధిత ఫైలు గవర్నర్ ఆమోదంకోసం వెళ్లింది. మరోవైపుబీసీల రిజర్వేషన్లు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడ్డ కులస్థుల నుంచి చాన్నాళ్లుగా డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో 42 శాతం రిజర్వేషన్లకు గ్రీన్‌సిగ్నల్ లభిస్తుందనే ఆశాభావంలో పోటీదారులు ఉన్నారు. ఒక వేళ రిజర్వేషన్ అనుకూలించిన పక్షంలో పరిషత్ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే కుతూహలంతో బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకులు ఉన్నారు. పరిషత్‌ఎన్నికల్లో పోటీ పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో ఎలాగైనా టికెట్ సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. టికెట్‌కోసం ఎమ్మెల్యేలు, వివిధమండలాల ద్వితీయ శ్రేణి నాయకులతో నిత్యంటచ్‌లో ఉంటున్నారు. గత ఎన్నికల్లోనూ బీసీలు పైచేయి సాధించిన దాఖలాలు అనేకం ఉన్నాయి. జనరల్ స్థానాల్లోనూ తమ ప్రతిభను కనబరిచి అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈనేపథ్యంలో వివిధమండలాల నుంచి పెద్ద మొత్తం లో వెనుకబడ్డ కులస్థులు టికెట్ రేసులో ఉన్నారు. పరిషత్‌ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చే విధంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ముఖ్యనేతలు ప్రణాళికలుసిద్ధం చేసుకుంటున్నారు.

జిల్లాలో 3.7 లక్షల పై చిలుకు ఓటర్లు...

పంచాయతీ ఎన్నికలకుగాను అధికారులు రూ పొందించిన తుదిముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 306గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లు ఉన్నారు. వీరిలో స్త్రీలు 1,91,011మంది ఉండగా, పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఓటర్లు ఉన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

కాసిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఈ యేడాది రాయితీపై వ్యవసాయ పని ముట్లు అందుబాటులో ఉన్నాయని మండ ల వ్యవసాయాధికారి ప్రభాకర్ ఒక ప్రక టనలో తెలిపారు. 84 బ్యాటరీ స్ప్రేర్స్ 15 పవర్ స్ప్రేర్స్, 5 రోటోవేటర్లు, 5 ప్లౌకల్టీ వేటర్లు, కేజీ బీవీల్స్‌తో పాటు ఒక విత్తనా లు విత్తేయంత్రం, ఒక పవర్ వీడర్, ఒక బ్రష్ కట్టర్లు అందుబాటులో ఉన్నాయ న్నా రు. ఆసక్తి, అర్హత ఉన్న రైతులు ఈనెల 12 లోగా మండల వ్యవసాయా కార్యాలయం లో స్థానిక రైతు వేదిక వద్ద ఏఈవోలకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

గూడెంలో సత్యదేవుడిని దర్శించుకున్న భక్తజనం



సామూహిక సత్యనారాయణ పూజల్లో పాల్గొన్న దంపతులు

దండేపల్లి, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): భాద్రపద పౌర్ణమి పురస్కరించుకోని దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం పౌర్ణమి జాతర వైభవంగా జరిగింది. ఉదయం నుంచే వందలాది మంది భక్తులు కుటుంబసమేతంగా తరలివచ్చి ప్రత్యేక పూజలతో సత్యదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. వ్రత మండపాలలో వందలాది మంది దంపతులు కుటుంబసమేతంగా సత్యదేవుడికి సాముహిక వ్రతాలను ఆచరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలతో స్వామిని దర్శించుకున్నారు.

స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి తీర్థ ప్రసాదంతో పాటు దేవస్థానంలో భక్తులకు భోజనం సదుపాయం కల్పించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

- వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న ఒకరు
- గణపతిని ప్రతిష్ఠించి మరొకరు
- అభినందిస్తున్న స్థానికులు



మల్కేపల్లిలో గణపతి విగ్రహంతో ముస్లిం యువకులు

కాసిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండలంలో మతసామరస్యం వెల్లివిరుస్తోంది. మండలంలోని మల్కేపల్లికి చెందిన రఫీక్ గణనాథుడిని మూడేళ్లుగా ప్రతిష్ఠించి హిందూ సోదరులతో కలిసి పూజలు నిర్వహిస్తున్నాడు. అలాగే ఈ ఏడాది దేవాపూర్ గొల్లవాడలోని రెండు గణపతి మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో దేవాపూర్‌కు చెందిన ముస్లిం యువకులు ఎండీ ఇమ్రాన్, సాహీర్ అహ్మద్‌లు లడ్డూను భారీగా వేలం పాట పాడి దక్కించుకున్నారు. లడ్డూను ఇంటికి తీసుకువెళ్లడంతో కుటుంబీకులు, మహిళలు సైతం అదే ఉత్సాహంతో వారిని సంతోషంగా ఆహ్వానించడం విశేషం. నాలుగు దశాబ్దాల నుంచి దేవాపూర్‌లో ఏ పండగ అయినా ఏ వేడుకైనా హిందూ మస్లింలందరు కలిసే జరుపుకుంటున్నారు.

మూడేళ్లుగా గణపతిని పెడుతున్నాం..

రఫీక్, మల్కేపల్లి



నాకు నా కుటుంబానికి అంతా మంచే జరుగుతుంది. దీనికి నాకు టుంబ సభ్యులతో పాటు స్థానికులందరు సహకరిస్తున్నారు. అందుకే మూడేళ్ల నుంచి గణపతిని ఏర్పాటు చేస్తున్నాను. మా కాలనీలో ఏ పండగ అయినా అందరం కలిసి ఆనందంగా జరుపుకుంటాం. మాకు కులమతాలతో పట్టింపు లేదు. చిన్నప్పటి నుంచి అందరి ఇళ్లలో కలిసి పెర గడం వల్ల ఎలాంటి అభిప్రాయ బేధాలు రావడం లేదు. గణపతిని ప్రతి ష్ఠించడంతో పాటు నిమజ్జనాన్ని కూడా అంతే భక్తి శ్రద్ధలతో ముగిస్తాం.

మేకల మందపై పులి దాడి

లక్షెట్టిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం కొత్తకొమ్ముగూడెం అటవీ ప్రాంతంలో ఆదివారం మేకల మందపై పెద్దపులి దాడి చేసింది. ఇదే గ్రామానికి చెందిన పెరుమాండ్ల బూమన్న అనే రైతు తన మేకలను మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అటవీ ప్రాంతంలో రెండు పెద్ద పులులు మందపై దాడి చేసి రెండు మేకలను తీసుకుపోగా మరో ఆరు మేకలు పారిపోయాయని బాధితుడు వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని అటవీ ప్రాంతంలో గాలించగా ఒక మేక మృతి చెందినట్లు గుర్తించారు, మరో మేక కోసం గాలించినా దొరకలేదు. చీకటి పడటంతో తెల్లవారుజామున గాలిస్తామని అటవీ సిబ్బంది చెప్పారు. ఈదాడిలో మందలో నుంచి సుమారు మరో ఆరు మేకలు కూడా పారిపోయినట్లు సమాచారం. ఈ విషయంపై అటవీ క్షేత్ర అధికారిణి అనితను వివరణ కోరగా మేకల మందపై దాడి జరిగిన విషయం వాస్తవమే కానీ అది పెద్దపులా లేక చిరుత పులా అనేది తేలాల్సి ఉందని, చీకటి పడటంతో కెమెరాలను ఏర్పాటు చేసామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.


గిరి ప్రదిక్షణ



గిరిప్రదిక్షణలో పాల్గొన్న భక్తులు

మందమర్రిరూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బొక్కలగుట్టలోని దృశ్యముఖ పర్వతంపై ఆదివారం గిరి ప్రదిక్షణను ఘనంగా నిర్వహించారు. శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి 8వ విడత గిరి ప్రదిక్షణలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు నోముల ఉపేందర్‌గౌడ్, గందె రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు సత్తయ్య, ఆలయ కమిటీ సభ్యులు కిషన్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులకు ఘన సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

తాండూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా కమిటీలో చోటు సాధించిన జిల్లా కార్యదర్శి రామగౌనీ మహీదర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు సిద్దం మల్లేష్, సంగర్సు శీతల్‌ను ఆదివారం తాండూర్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శులుగా నియామకమైన కుమార్, విగ్నేష్, కార్యదర్శి రాజేశంలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భరత్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు శేషగిరి, తిరుపతి, సురేష్, శ్రీనివాస్, శంకర్, చందు, తిరుమలేష్, శివ, శాంతన్‌కుమార్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులు



అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ నాయకులు

లక్షెట్టిపేట, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో బహుజన సమాజ్ పార్టీ నేతలు ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న నాయకులు లక్షెట్టిపేటలో ముందుగా అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్నట్లు పలువురు నాయకులు పేర్కొన్నారు. నాయకులు రవీందర్, రాజేంద్రప్రసాద్, నాగుల కిరణ్‌బాబు, శ్రీనివాస్, శంకర్, ఎండి, మాతిన్‌ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం మద్దిమల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామ వాసి మాలోతు రాజిరెడ్డి తీవ్రగాయాల పాలయ్యాడని ఎస్ఐ లక్ష్మణ్ ఆదివారం రాత్రి తెలిపారు. గ్రామంలోని మాలోతు రాజిరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మాలోతు లక్‌పతి తన బైక్‌తో ఢీకొట్టాడని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు లక్‌పతిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవం ముగిసింది..వేదన మిగిలింది

- గోదావరిలో కరగని విగ్రహాలు
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు...

నస్పూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిన్నటి దాకా భక్తులతో ఘనంగా పూజలందుకున్న బొజ్జ గణపయ్య విగ్రహాలు... నిమజ్జనం అనంతరం నేడు గోదావరిలో శకలాలై దయనీయస్థితిలో దర్శనమిస్తున్నాయి. మట్టి విగ్రహాలైతే నిమజ్జనం చేయగానే కొన్ని గంటల్లో కరిగిపోయేవి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కావడం వలన అవి ఇప్పట్లో కరిగే పరిస్థితి కనిపించడంలేదు. తాజాగా గోదావరి నదిలో నిమజ్జనం చేసిన విగ్రహాల దుస్థితిని చూసి భక్తుల హృదయాలను ద్రవిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. నిమజ్జనం చేసిన విగ్రహాల శకలాలుగా మిగిలిపోవడం అపచారమేనని పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మళ్లీ వచ్చే వేడుకలల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాల్సినవరం ఎంతైన ఉందని పర్యావరణవే త్తలు చెబుతున్నారు.

● మట్టి విగ్రహాలే ముద్దు...

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు... బంక మట్టి విగ్రహాలే ముద్దు.. అని అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు ప్రచారం చేసిన, గొంతెత్తి అరి చిన జిల్లాలోని యువజన సంఘాలు, భజన మండళ్లు, భక్తులు పెద్దగా పట్టించుకోలేదు. పోటాపోటీగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను తెచ్చి ప్రతిష్ఠించారు. చాలా వరకు విగ్రహాలు గోదావరి నదిలోకి వచ్చి చేరాయి. గణపతి నవరాత్రుల పండగ ముగిసింది..వ్యర్థాలు మిగిలి పోయాయి. పర్యావసానంగా గాలి, నీరు, ధ్వని కాలుష్యాలు పెరుగుదలకు కారణాలైయ్యాయి.



గోదావరి నదిలో ఒడ్డున వినాకయ విగ్రహ శకలాలు

● నీటి కాలుష్యం..

విగ్రహాలను ప్లాస్టిక్ ఆఫ్ పారిస్‌ను ఉపయోగించడం వలన సాధారణంగా విగ్రహాలు కరగడానికి చాలా సమయం పడుతుంది. విషరసాయనాలు, రంగులు వాడడం వలన నీరు కలుషితం అయి అందులో జీవిస్తున్న జీవాలు మరణిస్తున్నాయి. వాగుల్లో, నదుల్లో, చెరువుల్లో వేలాది విగ్రహాలను నిమజ్జనం చేయడం మూలంగా నీరు కలుషితం కావడం, టన్నుల కొద్ది చెత్తచెదారం పేరుకుపోతుంది.

టన్నుల కొద్ది రంగుల విగ్రహాల రసాయనాలు నీటిపై, పరిసర ప్రాంతంలో పడి ఉంటాయి. గణపతి నిమజ్జన సందర్భంగా టపాసులు కాల్చడం మూలంగా గాలి కాలుష్యం ఏర్పడి గాలిలో బేరియం, కాడ్మియం, సోడియం, మెర్క్యురీ, నైట్రేట్ విష పదార్థాలు చేరుతాయి. ఫలితంగా మనుషులు ఆ గాలిని పీల్చినప్పుడు విషవాయువు మనిషి పీల్చుకోవడంతో ఊపిరి తిత్తుల సమస్యను తెచ్చిపెడుతుందని వైద్యులు చెబుతున్నారు.

● జీవ వైవిధ్యానికి విఘాతం

గుండేటి యోగేశ్వర్ పర్యావరణ వేత్త, నస్పూర్



వినాయక విగ్రహాల తయారిలో క్యాల్షియం సల్ఫేట్ రసాయన పదార్థాన్ని ఎక్కువగా ఉపయోగిస్తు న్నారు. దీని వలన కొన్ని నెలల పాటు అవశేషాలుగా మిగిలి ఉంటాయి. రసాయంలో ఫెర్రిక్, ఆక్సైడ్, క్రోమియం ఆక్సైడ్, కోబాల్ట్ ఆక్సైడ్ రసాయనాలను వివిధ రంగులు వినియోగిస్తున్నారు. నీటిలో సకాలంలో కరుగకపోవడం రంగుల్లో ఉన్న రసాయనాలు నీటిపై పొరగా తేలిపోయి ఆ నీటిని తాగిన పక్షులు, జంతువులు వివిధ రకాలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నది. తద్వారా జీవవైవిద్యానికి తీవ్రమైన విఘాతం కలుగుతుంది.

● మట్టి ప్రకృతి స్వరూపం

గంగారపు వంశీ కృష్ణ శర్మ- పండితులు



పార్వతి మట్టితోనే వినాయకుడిని చేసి ప్రాణం పోసింది. దేవతలు కూడా మట్టితో వినాయకు ప్రతిమ తయారు చేసి పూజించారు. మట్టి ఎక్కడైనా లభిస్తుంది. దానికి పేద, ధనిక తారతమ్యం లేదు. మట్టితో తయారు చేసిన విగ్రహానికి పూజలు చేయడం, 21 రకాల ఔషధ గుణాలు కలిగిన ఆకులతో నిమజ్జనం చేయడం వలన నీటి శుద్ధి జరుగుతుంది. ప్రస్తుతం రంగుల విగ్రహాలు నిమజ్జనం చేయడంతో నీటిలో కరగని పరిస్థితి దాపురించింది. పర్యావరణానికి హాని కలగడమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.



'అంగన్‌వాడీ'ల్లో కూరగాయల సాగు

- పోషణ్ వాటికల పేరుతో ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా 100 కేంద్రాల గుర్తింపు
- ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- చర్యలు తీసుకుంటున్న అధికారులు

బెజ్జూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్ల లు, గర్భిణులు, బాలింతల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలలో ఇకపై కూరగాయలు, ఆకు కూరలు పండించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. అందుకు పోషణ్ వాటిక అని పేరుతో ప్రభుత్వం సూచించింది. జిల్లా వ్యాప్తంగా 100 కేంద్రా లను ఎంపిక చేయడంతో పాటు తోటల నిర్వహణ కోసం ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు కూడా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా కూరగాయల విత్తనాలను పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు సమాయత్తం చేస్తున్నారు.

● జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా సొంత భవనాలు ఉన్న కేంద్రాలు 317, పాఠశాలల్లో కొనసాగుతున్న భవనాలు 353, అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలు 303 కొనసాగుతున్నాయి. జిల్లాలో కూరగాయల సాగుకు స్థలం అనుకూలంగా ఉన్నవి 100 కేంద్రాలను గుర్తించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 72 కేంద్రాలను గుర్తించగా మరో 28 కేంద్రాలను గుర్తించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో సొంత భవనంలో కొనసాగుతున్న కేంద్రాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. కూరగాయల సాగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్క కేంద్రానికి రూ.10 వేలు కేటాయించింది. ఆ నిధులను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. మంజూరైన నిధులను ఎలా ఎందు కోసం ఖర్చు చేయాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనుంది. ఆ ప్రకారం ఆయా కేంద్రాలకు త్వరలోనే నిధులు రానున్నాయి. ప్రభుత్వం కేటాయిం చిన నిధులతో ఖాళీ స్థలాలను చదును చేసి కూరగాయలు, ఆకుకూరల పెంపకం కోసం స్థలాన్ని చదువు చేసి సిద్ధం చేస్తారు. అలాగే విత్తనాలు, సారవంతమైన మట్టి, ఎరువు కోసం ఈ డబ్బును ఖర్చు చేయనున్నారు. వీటిని ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

● విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు..

జిల్లాలో పోషణ్ వాటిక కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయల సాగు కోసం ప్రభుత్వం శ్రీకారం చుట్టగా అందుకు అనుగుణంగా విత్తనాల పంపిణీకి ఏర్పాట్లను చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం జాకీ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తోది. ఇందులో టమాట, బెండకాయ, ముల్లంగి, మునగ, ఆకు కూరలు, ఇతర కూరగాయల విత్తనాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రా ల్లో స్థలం అనుకూలమైన వాటిని గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఏ విధమైన కూరగాయల సాగు ఏపట్టాల ని దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుర్తిం చిన కేంద్రాలకు ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల టీచ ర్లకు సమాచారాన్ని అందించినట్లు తెలుస్తోంది.

● పౌష్టికాహారాన్ని అందించేందుకే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ప్రభుత్వం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుంది. ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రీయ పద్ధతుల్లో కూరగాయలు, ఆకు కూరలను పెంచేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడంతో పాటు గర్భిణులు, బాలింతలు చిన్నారులకు పోషకాహారం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. బహిరంగ మార్కెట్‌లో అవసరానికి సరిపడ కూరగాయలు ఆకుకూరలు దొరకడం లేదు. అలాగే ధరలు పెరగడం నాణ్యత కురవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తున్నాయి. కూరగాయల ధరలు పెరిగిన సమయంలో ప్రభుత్వం కేటాయించే నిధులు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయలు, ఆకు కూరలు పండించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం సొంత భవనాలు, ఖాళీ స్థలాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు గుర్తించి కూర గాయల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. కానీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయల సాగు పెంపకానికి చర్యలు తీసుకోగా కేంద్రాల్లో సరిపడా నీటి వసతి, స్థలాల కొరత కారణంగా పెంపకం సాధ్యమయ్యేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోషణ్ వాటికల ఏర్పాటుకు చర్యలు..
- ఆడెపు భాస్కర్, జిల్లా సంక్షేమ శాఖాధికారి



జిల్లాలో 100 కేంద్రాల్లో పోషణ్ వాటికలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అంగన్ వాడీ టీచర్లకు ఆకుకూరల సాగుపై ఉద్యాన శాఖ అధికారులతో శిక్షణ ఇప్పిస్తాం. త్వరలోనే విత్తనాల ప్యాకెట్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తాం. కేంద్రాల ఆవరణ లోనే పెంచితే చిన్నారులకు తాజా కూరగాయలతో పోషకాహారాన్ని అందించేందుకు అవకాశం ఉంది. ఎం పిక చేసిన కేంద్రాల్లో త్వరలోనే అమలు చేస్తాం.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆసిఫాబాద్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్ననాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో జీఎస్టీపై సంస్కరణలు తీసుకొచ్చిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి జిల్లా కేంద్రంలో ఆదివారం బీజేపీ సీనియర్ నాయకులు వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్ యాదవ్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీపై సంస్కరణలు తీసుకరావటం హర్షణీయమని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెంటయ్య, దీపక్ రావు, ప్రహ్లాద్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామంలో మండల బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్ర పటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇటీవల కేంద్రం జీఎస్టీని 18శాతం నుంచి 8శాతానికి తగ్గించడం వల్ల ప్రజలకు అనేక నిత్యావసరాల వస్తువుల ధరలు తగ్గుతున్నాయని చెప్పారు. సుమారుగా 400 వరకు ఉత్పత్తుల ధరలు తగ్గాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ములె మల్లయ్య, కోంపరి బాలయ్య, దంద్రె పోశన్న, శంకర్ మండల్, చాప్లె సుధాకర్, కుకడ్కర్ రమేష్, చౌదరి నవీన్, దన్నూరి సాయి, గణేష్ రప్తాన్, హర్షిత్ రప్తాన్, రౌతు భాస్కర్. రవు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుతో పత్తి రైతులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రవికుమార్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో పత్తి పంట కొనుగోలుపై రానున్న రోజుల్లో ప్రభావం పడనుందని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారి రవి కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తిపంటపై ఉన్న 11 శాతం టారీఫ్‌ను సున్నాకు తేవడంతో దేశంలోని పత్తిరైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వచ్చే పదివేల కోట్ల పత్తి దేశానికి చేరే ప్రమాదం ఉందన్నారు. దీంతో దేశంలోని పంట ధర తగ్గుతుందన్నారు. పెట్టుబడి దారి దేశాలకు సహకరించే విధంగా పీఎం మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారదీ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధాఆన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అన్నారు. వెంటనే సర్వేనిర్వహించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రాజన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు రవి, మల్లేష్, జిల్లా కమిటీ సభ్యుడు దినకర్, కార్తిక్, రాజేందర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

సిర్పూరు(టి), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు(టి) మండలం పారిగాం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన కొందర నాయకులు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై తాము చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పూరు(టి) బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అస్లం బీన్ అబ్దుల్లా, నాయకులు హీరామాన్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసిన జర్నలిస్టులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం టీయూడబ్ల్యూజె(ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రకాష్ గౌడ్, కృష్ణం రాజు, రమేష్, అన్వన్, శ్రీనివాస్, సురేష్ చారి, రాధాకృష్ణచారి పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

బెజ్జూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను ఎంపీడీవో కార్యాలయంలో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

బహుమతుల అందజేత

ఆసిఫాబాద్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ సంద ర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచి వారికి ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి బహుమతులను ప్రదానం చేశా రు. పట్టణంలోని మహ్మదీయ రజ, దీన్ మదర్సాలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మదర్సా ప్రధానోపాధ్యాయుడు షబానా బేగం పాల్గొన్నారు.

అట్టహాసంగా ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోటీలకు ఎంపికైన అండర్-14 జట్టు

రెబ్బెన, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాల మైదానంలో 44వ సబ్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-14 సంవత్సరాల బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలకు క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఆదిలాబాద్ జిల్లా సబ్ జూనియర్ జట్లు తేది 13 నుంచి 14 వరకు జనగామ జిల్లా కూనూరు గ్రామలో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి ఆదిలబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుపతి తెలిపారు.ఎంపిక పోటీలకులకు అతిథులకు బీజేపీ వైస్ ప్రసిడెంట్ గుల్బం చక్రపాణి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఒలింపిక్ వర్కింగ్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, షార్ప్ స్టార్ అ. ధ్యక్షుడు వి.మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బాలికల జట్టుకు ఎం సహస్ర, టి ప్రజ్వల, శ్రావ్య, ఎస్ సాయి శ్రీ, వర్షిణి, వేరోనికా, హన్నా, సిరి, రాజేశ్వరి, పవిత్ర, అల్వీన, ఎస్ రిషిత, నందిని, విజయ స్ఫూర్తి, బేభా ఎంపికయ్యారు.


● బాలుర జట్టుకు సీహెచ్ వరుణ్, సీహెచ్ నిఖిల్, ఎం కృష్ణ, లోకనందు, అఖిల్, రాఘవ, అంజనేయులు, స్టేఫెన్, అశ్విన్, తిరుపతి, అరవింద్ డి విష్ణువర్ధన్, త్రిచూర్ కృష్ణ ఎంపికయ్యారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెపక్ తక్రా పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు సింగరేణి హైస్కూల్ గ్రౌండులో నిర్వహించినట్టు ఆదిలాబాద్ జిల్లా సెపక్ తక్రా ఆర్గనైజేషన్ సెక్రెటరి కె మల్లేష్ తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు ఈ నెల 20 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి పట్టణం గవర్నమెంటు పాలిటెక్నిక్ గ్రౌండులో అంతర్ జిల్లాల టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. సెపక్‌తక్రా పోటీలకు ముఖ్య అతిథులుగా రెబ్బెన మండల బీఆర్ఎస్ అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ ఎంపికైన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ వర్కింగ్ అధ్యక్షులు ఆర్ నారాయణ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా జాయింట్ సెక్రెటరీ శిరీష, ఎగ్జిక్యూటివ్ సభ్యులు అభినందించారు.

● సెపక్ తక్రా జిల్లా పురుషుల జట్టుకు రాజేందర్, ఆర్.వెంకటేష్, చందు, రాజశేఖర్, రాందాస్ ఉన్నారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ సెపక్‌తక్రా ఆదిలాబాద్ సెపక్‌తక్రా మహి ళ జట్టు టి అనూష, కె స్ఫూర్తి, కారుణ్య, నిహశ్రీ, అభినవ, రమ్య, కె.శ్రీవల్లి ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెపక్ తక్రా ఆర్గనైజేషన్ సెక్రటరి కుమ్మరి మల్లేష్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల అక్రమాలకు చెల్లు

మొబైల్ యాప్‌లో కొత్త ఆప్షన్ తీసుకువచ్చిన ప్రభుత్వం



వాంకిడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల చెల్లింపులో క్షేత్రస్థాయి అధికారులు అక్రమాలకు పాల్పడకుండా ప్రభుత్వం ఇందిరమ్మ మొబైల్ యాప్‌లో కొత్త ఆప్షన్ (ఫొటో క్యాప్చర్)ను తీసుకొచ్చింది. లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడానికి ముందు పట్టణాల్లో వార్డు అధికారి, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి ఇంటి ఫొటోను హౌసింగ్ ఏఈ లాగిన్‌కు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పనుల పరిశీలనకు క్షేత్రస్థాయి అధికారులు రావడానికి జాప్యం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు అధికారులు డబ్బులు ఇస్తేనే వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు నిదర్శనం ఇటీవల మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం కర్ణమామిడిలో లబ్ధిదారుని ఇంటి నిర్మాణం పనుల ఫొటో తీసి అప్‌లోడ్ చేయడానికి రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటనతో పాటు అనేక గ్రామాల్లో ఇంటి ఫొటో అప్‌లోడ్ చేసే సమయంలో అధికారులు లబ్ధిదారులను ఇబ్బందులు పెడుతున్నారనే నేపథ్యంలో ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది.

డౌన్‌లోడ్ ఇలా..

లబ్ధిదారులు సెల్‌ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. బెనిఫిషర్ లాగిన్‌కు వెళ్లి లబ్ధిదారు పేరు, సెల్‌ఫోన్ నంబరు, గ్రామం వివరాలు నమోదు చేయాలి. తర్వాత ఇంటి నిర్మాణం ఏ దశలో ఉందో ఫొటో అడుగు తుంది. ఆ దశకు సంబంధించిన ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. నిర్మాణ దశకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇస్తే ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత గృహనిర్మాణ శాఖ ఏఈ క్షేత్రస్థాయిలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి వివరాలను డీఈ లాగిన్‌కు, పీడీ, జిల్లా కలెక్టర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఈఈకి, ఎస్ఈకి, సీఈ, ఎండీ లాగిన్‌కు ఆన్‌లైన్‌లో వెళ్తాయి. అనంతరం లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో దశల వారీగా బిల్లులు జమ చేస్తారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

సిర్పూరు(టి), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే పార్టీలో చేరుతున్నామని సిర్పూరు(టి) మండలం వెంకట్రావుపేట గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్‌లు దౌవులత్, సంతోష్ అన్నారు. ఎమ్మెల్సీ నివాసంలో ఆదివారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ సర్పంచిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్నీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీటీసీ మహ్మద్ సోహెల్ అహ్మద్, సిర్పూరు(టి) మాజీ జడ్పీటీసీ దోని రవీందర్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబుల్ అఖీల్, అఫ్జర్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవిహార్‌లో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఉపాసకులు

వాంకిడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జైత్పూర్, ఖమన గ్రామంలోని నాగోసెన్ బుద్ధవిహార్‌లో ఆదివారం భాద్రపద పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం అంబేడ్కర్ సంఘంతో పాటు బౌద్ధ భిక్షువు భరద్వాజ్ ఆధ్వర్యంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ బౌద్ధ ఆచారం ప్రకారం వర్షవాస్ (గ్రంథ పఠనం) కాలంలో వచ్చే పౌర్ణమిలకు ప్రత్యేక విశిష్టత ఉంటుందన్నారు. మహిళలు అష్టాంగ మార్గాలను పాటించడంవల్ల ప్రతి ఇంట్లో కష్టాలు తొలగిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ఐ, అంబేడ్కర్ సంఘం నాయకులు అశోక్, దుర్గం దుర్గాజీ, జైరాం, శ్యాంరావు, పాండుజీ, కిషన్, మారుతి, రమాబాయి మహిళా మండలి నాయకులు కృపావాణి, ధర్మబాయి, రుక్మిణి, సరోజ, గంగుబాయి ఉపాసకులు పాల్గొన్నారు.

యాసంగి పంటలకు భరోసా..

▸▸ నాగమ్మ చెరువుకు జలకళ

సిర్పూర్(టి), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగమ్మ చెరువులోకి పూర్తి స్థాయిలో నీటి మట్టం చేరడంతో యాసంగి పంటలకు ఇబ్బం దులు తొలగిపోయాయని రైతులు చెబుతున్నారు. సిర్పూర్ (టి) మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీల పరిధిలో 21 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ వానాకాలం సీజన్‌లో రైతులు ఐదు వేల ఎకరాల్లో వరి, 15 వేల ఎకరాల్లో పత్తి, మరో వెయ్యి ఎకరాల్లో ఇతర పంట లను వేశారు. కాగాసిర్పూర్(టి) మండల కేంద్రంలోని నాగమ్మచెరువు కింద 15 వందల ఎకరాల్లో రైతులు వరి సాగునాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో ఈ సారి కురిసిన వర్షాలతో చెరువు నిం డుకుండలా మారడంతో యాసంగి పంటకు సైతం నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలో వరి సాగుకు అనువైన కుంటలు, చెరువులు, పూర్తి స్థాయిలో నిండి పోవడంతో ఆయకట్టు రైతులు వచ్చే యాసంగి సీజన్‌లో రెండో పంట సాగు పక్కా చేయవచ్చని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక పత్తి పంట సాగు చేస్తున్న రైతులు ఇటీవల కురిసిన వర్షాలు పంటలకు సరిపడతాయని రైతులు వారి పత్తి చేనులలో కలుపు తీయడం, మందులు పిచికారి చేయడం పనుల్లో నిమగ్నమయ్యారు.



జలకళను సంతరించుకున్న నాగమ్మ చెరువు



నాగమ్మ చెరువు కింద సాగవుతున్న వరి పంట

వరినాట్లు పూర్తయ్యాయి..
- గిరీష్, వ్యవసాయాధికారి



మండల వ్యాప్తంగా చెరువులు కుంటల ఆయకట్టు రైతులు వరి నాట్లు పూర్తి చేసుకున్నారు. రైతులు సాగుపై ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తున్నాం. నెల రోజుల్లో వరి పొట్ట దశకు వస్తుంది. రైతులు తప్పకుండా వారి వారి పంటల వివరాలను ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలి.